క్లుప్తంగా

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ



డ్రైవర్లను అభినందిస్తున్న అధికారులు

మెట్‌పల్లి: వాహనాలు నడిపేటప్పుడు డ్రైవర్లు ప్రతి క్షణం అప్రమత్తంగా ఉంటేనే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని ఎంవీఈ శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం నిర్వహించిన ప్రమాద రహిత వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఒక్క డ్రైవర్ మీద ఎంతో మంది ప్రాణాలు ఆధారపడి ఉంటాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. అనంతరం విధి నిర్వాహణలో ప్రమాదాలు లేకుండా ఉత్తమ సేవలందించిన డ్రైవర్లు ఎంఏ రెడ్డి, రవీందర్, ఎల్‌బీ రావులను అభినందించారు. కార్యక్రమంలో డీఎం దేవరాజు,సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల్లో వలంటీర్ల సేవలు మరువలేనివి



ప్రశంసా పత్రాలు అందిస్తున్న ప్రిన్సిపాల్

జగిత్యాల: ఎన్నికల్లో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల సేవలు మరువలేనివని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. మంగళవారం వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆర్డీవో ఆదేశాల మేరకు మే 13న జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వృద్ధులు, వికలాంగులతో పాటు, క్యూలైన్లలో ఉన్న వారికి మజ్జిగ ప్యాకెట్లు అందించడం, ఎన్నో సేవలందించారన్నారు. సమాజ హితమే ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పడాల తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, జమున, సుల్తానా, చంద్రయ్య పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల ముందస్తు అరెస్ట్



ఆశా కార్యకర్తలను అరెస్టు చేసిన పోలీసులు

జగిత్యాల రూరల్/రాయికల్: తమ సమస్యల పరిష్కారం కోసం సోమవారం అర్ధరాత్రి హైదరాబాద్‌కు వెళ్తున్న జగిత్యాల రూరల్,రాయికల్ మండల ఆశాకార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసులు ఎలాంటి మహిళా పోలీసులు లేకుండా తమను ఠాణాకు తీసుకురావడం సరైనది కాదని హెచ్చరించారు. అక్రమ అరెస్టుతో ఉద్యమం ఆపలేరన్నారు. కార్యక్రమంలో నాయకులు వనిత, కవిత, రమ, నీలిమ, లత, సుమలత, సత్యవతి, జమున పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



వంటగదిని పరిశీలిస్తున్న ఎంపీడీవో స్వాతి

మల్యాల: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, పాఠశాల ఆవరణలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీవో స్వాతి అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను మంగళవారం ఎంపీడీవో స్వాతి సందర్శించారు. పాఠశాలలోని కిచెన్‌లో కూరగాయలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను, అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల బారినపడకుండా శుభ్రత పాటించాలన్నారు. ఆమె వెంట జీపీ కార్యదర్శి శ్రీకాంత్ ఉన్నారు.

హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలి

జగిత్యాల: ఉర్దూమీడియం ప్రాథమిక పాఠశాలలకు హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలని పీఆర్టీయూ జిల్లా కార్యదర్శి ఆనందరావు అన్నారు. మంగళవారం ఖాజీపుర హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎజాజ్ పదవీ విరమణ పొందగా ఆయనను ఘనంగా సన్మానించారు. టీఆర్టీ ద్వారా నింపబడుతున్న ఉర్దూమీడియం పోస్టులకు రిజర్వ్‌డ్ కేటగిరి అభ్యర్థులు లేనందునా జనరల్ కేటగిరి అభ్యర్థులతో భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రహీం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధ్వానంగా అంతర్గత రహదారులు

సారంగాపూర్: మండలంలోని రంగపేటలో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. గ్రామంలో ఏ వీధికి వెళ్లాలన్నా చెప్పులు చేతపట్టుకుని వెళ్లే పరిస్థితి నెలకొంది. లేదంటే ఆ బురదలోనే ఇరుక్కుపోయే దుస్థితి ఉంది. గ్రామంలోని అంతర్గత రోడ్లు బురదమయంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామం మొత్తం చిత్తడిచిత్తడిగా మారింది. బస్టాండ్ నుంచి గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారిలో బురదలో ప్రజలు నడవలేని దుస్థితి నెలకొంది. వీటితో పాటు బస్టాండ్ నుంచి ఎల్లమ్మ ఆలయం వరకు, గ్రామం నుంచి పెద్దమ్మ ఆలయం వరకు ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాన్ని సందర్శించి రోడ్లు బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



పంట రుణమాఫీపై కాంగ్రెస్ సంబురాలు



పెగడపల్లిలో సంబరాలు చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

పెగడపల్లి: రైతులకు ప్రభుత్వం రెండో విడుతగా రూ. 1.50 లక్షల వరకు పంట రుణమాఫీ చేయడాన్ని హర్షిస్తూ మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు జరిపారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద టపాసులు పేల్చి ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాములుగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: రుణమాఫీ చేయడంతోరాష్ట్రం దేశ చరిత్రలో నిలిచిపోతుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో సీఎం ప్రసంగాన్ని రైతులు, అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో వీక్షించారు. కార్యక్రమంలో ఏవో దీపిక, ఏఈవోలు రైతులు పాల్గొన్నారు.

కోరుట్ల: మండలంలోని అయిలాపూర్ రైతు వేదికలో రెండవ విడత రైతు రుణ మాఫీ సంబరాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని వీక్షించారు. రెండవ విడతలో 968 మంది రైతులకు రుణ మాఫీ వర్తించిందని మండల వ్యవసాయ అధికారి నాగమణి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

మేడిపల్లి: ప్రభుత్వం రూ.1.5 లక్షల మేరకు రుణమాఫీ చేయడంతో మండల కేంద్రంలోని రైతు వేదికలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. రెండో విడతలో మండల వ్యాప్తంగా 1211 మంది రైతులకు రుణమాఫీ అయినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.

ప్రభుత్వ విప్‌కు సన్మానం



విప్ లక్ష్మణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

ధర్మపురి: ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయడం పట్ల హర్షిస్తూ ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ దినేశ్, వేముల రాజేశ్, చిలుముల లక్ష్మణ్, రమేశ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించండి



ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైఠాయించిన మాజీ సర్పంచ్‌లు

వెల్గటూర్: ఉమ్మడి వెల్గటూర్ మండల పరిధిలోని గ్రామ పంచాయతీల మాజీ సర్పంచుల పదవీ కాలం పూర్తయి ఆరు నెలలు గడిచినా ఇప్పటికీ పెండింగ్ బిల్లులు చెల్లించలేదని, వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మాజీ సర్పంచులు బైఠాయించారు. బిల్లులు రాకున్నా లక్షల రూపాయలు అప్పు చేసి రైతు వేదికలు, నూతన గ్రామపంచాయతీ భవనాలు, అభివృ పనులు చేసామని, ఇంతవరకు బిల్లులు చెల్లించకపోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు అనేకం ఉన్నాయన్నారు. అభివృద్ధి పనులు పూర్తయినా ఇంకా ఎంబీ రికార్డ్ చేయలేదని, ప్రస్తుత పీఆర్ ఏఈ, డీఈలు బదిలీలో ఉన్నందునా వెంటనే ఎంబీ రికార్డ్ చేసి సత్వరమే బిల్లులు చెల్లించాలని తాజా మాజీ సర్పంచులు కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు గంగుల నగేష్, కొమ్ము రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో బీసీలకు ప్రభుత్వం అన్యాయం



కలెక్టరేట్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

జగిత్యాలటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీలకు తీవ్రమైన అన్యాయం జరిగిందని, ఎన్నికల సమయంలో బీసీల జపం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి బడ్జెట్లో బీసీలకు మొండిచేయి చూపించారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి భార్గవరాం విమర్శించారు. మంగళవారం జగిత్యాల కలెక్టరేట్ ఎదుట రాష్ట్ర బడ్జెట్‌పై నిరసన వ్యక్తం చేశారు. బీసీ కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అగ్రవర్ణాల పాలనలో నష్టపోతున్న బీసీలు ఇప్పటికైనా కళ్లు తెరవాలని, మన హక్కుల కోసం పోరాటం చేయాలని కోరారు. అనంతరం కలెక్టరేట్‌లో పాలనాధికారికి వినతిపత్రం అందజేశారు కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు గాజుల నాగరాజు, బాలె వరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రీ స్కూల్ విద్యను సద్వినియోగం చేసుకోవాలి



అంగన్‌వాడీలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

పెగడపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేస్తున్న ప్రీస్కూల్ విద్యను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి కోరారు. పెగడపల్లి మండల కేంద్రంలోని మూడో అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. కేంద్రంలోని చిన్నారుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రీస్కూల్లో చేర్పించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, అంగన్‌వాడీ టీచర్ సుజాత, కారోబార్ స్వామి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో పూర్వ ప్రాథమిక విద్య

కథలాపూర్: మండలంలోని సిరికొండ, భూషణరావుపేట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమం నిర్వహించారు. చిన్నారుల పెరుగుదల, అభివృద్ధిని గుర్తించి వారికి అసెస్‌మెంట్ కార్డులు అందించారు. చిన్నారుల ఆరోగ్యం, అభివృద్ధిలో తల్లుల పాత్రను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సునంద, ప్రతిభ, వైద్యసిబ్బంది విజయలక్ష్మి, మమత, మహిళలు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న చైర్‌పర్సన్ జ్యోతి

జగిత్యాల:ప్రజాదర్బార్‌ను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శానిటేషన్, వీధిలైట్లు ఏదైనా సమస్య ఉంటే వచ్చి ఫిర్యాదు చేస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. ప్రతి మంగళవారం ఉదయం 10.30 నుంచి 12.30 వరకు ఉంటుందన్నారు. సుమారు 20 మంది వివిధ సమస్యలపై ఫిర్యాదు చేశారు.

ఎరుకల కులస్తులకు ప్రాధాన్యత కల్పించాలి

జగిత్యాల: ఎరుక కులస్తులకు ప్రాధాన్యత కల్పించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతికి ఎరుకుల సంఘం నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు లోన్లు ఇవ్వడంతో పాటు, పందుల పెంపకానికి ఐదెకరాల భూమి కేటాయించాలని, నిరుద్యోగ భృతి కల్పించాలని, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ నిధులు ఇవ్వాలన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి

జగిత్యాల: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌కే రెసిడెన్సీలో నవ్య గరల్స్ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్‌డే వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. ఇంటర్ దశ ఎంతో కీలకమైందని, జీవితంలో ఎలా స్థిరపడాలో ఈ దశనే నిలబెడుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నవ్య జూనియర్ కళాశాల కరస్పాండెంట్ శ్రీపాద నరేశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకవర్గాల ప్రమాణ స్వీకారోత్సవం



ప్రమాణస్వీకారం చేస్తున్న గండి హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ గండి హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు, డైరెక్టర్లు మంగళవారం ప్రమాణం స్వీకారం చేశారు. చైర్మన్‌గా ఏనుగు రామానుజన్ రెడ్డి, డైరెక్టర్లుగా సంపతి లక్ష్మి,ముస్కరి మల్లేశం,రేండ్ల రాజ్‌కిరణ్,మర్రిపెల్లి మనోజ్,కూకట్ల వేణుగోపాల్,చెన్నూరి సత్తయ్య, ఎక్స్‌అఫిషియో మెంబర్‌గా మాధవచారి ప్రమాణ స్వీకారం చేశారు.

మెట్‌పల్లి ఎడ్మాల లక్ష్మారెడ్డి ట్రస్ట్ చైర్మన్‌గా కొమ్ముల సంతోశ్‌రెడ్డి,డైరెక్టర్లుగా పోతు సత్యనారాయణ,చెర్లపల్లి రాజేశ్వర్‌గౌడ్,బర్ల లతిక,యామ చిన్నభూమయ్య, సుతారి బాల్‌రాజ్, పొట్ట రాజేశ్వర్ ప్రమాణ స్వీకాణం చేశారు. సభ్యులతో దేవాదాయ శాఖ అధికారులు ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని, నామినేటెడ్ పదవుల విషయంలో నాయకులు,కార్యకర్తలెవరు అసంతృప్తి చెందవద్దని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు,సుప్రీంకోర్టు అడ్వకేట్ కొమిరెడ్డి కరం, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రవికిషన్,ఈవో విక్రమ్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జలపతిరెడ్డి,మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు షీ టీమ్ కృషి



అవగాహన సదస్సులో విద్యార్థులు, టీచర్లు

జగిత్యాలక్రైం: మహిళల భద్రతకు షీ టీమ్ కృషి చేస్తోందని షీటీం ఏఎస్సై అలీబేగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కొత్తవాడ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో మంగళవారం షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మహిళలు, యువతులు ఎలాంటి సమస్యలున్నా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలన్నారు. మహిళలు, బాలికలు, విద్యార్థిని విద్యార్థుల రక్షణకు పోలీస్ శాఖ తరఫున షీ టీమ్, ఏహెచ్‌టీయూ టీమ్‌లు పనిచేస్తున్నాయన్నారు. షీ టీమ్ సభ్యులు ప్రత్యక్షంగా ఫిర్యాదులు తీసుకుంటారని, 8712670783 వాట్సాప్ ద్వారా కూడా ఫిర్యాదు చేయొచ్చని సూచించారు. కార్యక్రమంలో మహిళా కానిస్టేబుళ్లు చైతన్య,పూజిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డెంగీ అదుపునకు ప్రజల సహకారం అవసరం



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ జయపాల్‌రెడ్డి

సారంగాపూర్: డెంగీ జ్వరాలను అదుపులోకి తీసుకురావడానికి ప్రజల సహకారం అవసరమని జిల్లా మాతాశిశు సంరక్షణాధికారి డాక్టర్ ముస్కు జయపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పెంబట్లలోని పలు కాలనీల్లో పర్యటించి మాట్లాడారు. గ్రామంలో జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉండడంతో గ్రామంలోని ఎస్సీ కాలనీలో వైద్యశిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఇప్పటికే రెండు డెంగీ కేసులు నమోదయ్యాయని, దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామంలో మౌనిక అనే యువతికి డెంగీ నిర్ధారణ అయిందని, ఆమెకు చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శివకుమార్, సూపర్వైజర్ కుద్దుస్, ఏఎన్‌ఎం, ఆశాలు ఉన్నారు.

ఎస్సీ స్టడీ సర్కిల్ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలి

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలో ఎస్సీ స్టడీ సర్కిల్‌కు శాశ్వత భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. బడుగు, బలహీన వర్గాల నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షల్లో పాల్గొనేందుకు శిక్షణ ఇచ్చేందుకు పట్టణంలోని ప్రైవేట్ భవనంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎస్సీ స్టడీ సర్కిల్‌లో నివాసం తదితర వసతులకు సరిపోవడం లేదన్నారు. ధరూర్ క్యాంపులో ఎస్సారెస్పీ భూమి కేటాయించాలని, భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని కోరారు.

బ్రిడ్జి నిర్మించాలని లేఖ

రాయికల్: మండలంలోని జగన్నాథపూర్-బోర్నపల్లి గ్రామాల మధ్య పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ రెండు గ్రామాల మధ్యనున్న వాగుపై రూ.12 కోట్ల అంచనాలతో వంతెన నిర్మాణం చేపట్టాలని, ఈ వంతెన నిర్మిస్తే గిరిజనులకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

కలెక్టర్‌కు బీజేపీ నాయకుల ఫిర్యాదు

కోరుట్ల: రాష్ట్రంలో బీసీలకు రిజర్వేషన్ల విషయంలో అన్యాయం జరుగుతోందని, 6 గ్యారంటీల అమలు చేయించాలని బీజేపీ ఓబీసీ నాయకులు మంగళవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బింగి వెంకటేష్, జగిత్యాల పట్టణ అధ్యక్షుడు గోపాల్, అముద రాజు, ఓబీసీ పట్టణ అధ్యక్షుడు గంద్ర వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్యలో డిగ్రీ ప్రవేశాలు

జగిత్యాల: బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ ప్రవేశాలు ప్రారంభమైనట్లు ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల ప్రిన్సిపల్ అశోక్, కో–ఆర్డినేటర్ గోవర్ధన్ తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశం కోసం ఆగస్టు 18లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, డిగ్రీ 2,3వ సంవత్సరం విద్యార్థులు తమ ట్యూషన్ ఫీజు చెల్లించాలన్నారు. మిగతా వివరాల కోసం జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్ 9515702804 సంప్రదించాలన్నారు.

వైకుంఠధామంలో వసతులు కల్పించాలని వినతి

రాయికల్: పట్టణంలోని వైకుంఠధామంలో వసతులు కల్పించాలని, నీటి సదుపాయం లేక ఇబ్బందులు పడ్డామని నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు మంగళవారం కమిషనర్ చిరంజీవికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు బాలయ్య, గంగారాం, సురేశ్, నారాయణ, శ్రీనివాస్, రవీందర్ పాల్గొన్నారు.

3న ఇసుకకు వేలం

మెట్‌పల్లిరూరల్: అనుమతులు లేకుండా తరలించగా పట్టుబడ్డ ఇసుకకు ఆగస్ట్ 3న మెట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయ అధికారులు వేలం వేయనున్నారు. సీజ్ చేసిన ఇసుక మొత్తం 46 ట్రాక్టర్ ట్రిప్పులు ఉన్నాయని, వేలంలో పాల్గొనే వారు నాయబ్ తహసీల్దార్ వద్ద రూ.10 వేలు ధరావత్ చెల్లించాలని ప్రకటనలో పేర్కొన్నారు. మెట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఈ వేలం నిర్వహించనున్నారు.

గుంతలు పూడ్చివేత



వెల్గటూర్: మండల కేంద్రంలోని 7వ నెంబర్ రాష్ట్ర రహదారిపై పెద్ద వాగు వంతెనకు ఇరువైపులా పెద్ద పెద్ద గుంతలు పడి నిత్యం ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై మంగళవారం సాక్షిలో 'గుంతల రోడ్డుపై ప్రయాణమెలా?' శీర్షికన ప్రచురితమైన కథనానికి పోలీసులు స్పందించారు. ఎస్సై ఉమాసాగర్ సూచన మేరకు పోలీసులు రోడ్డుకు ఇరువైపులా గుంతలను మట్టితో పూడ్చి వేసి రోలర్‌తో రోడ్డు చదును చేయించారు. రోడ్డును బాగు చేయించినందుకు పోలీసులకు ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి స్పందన

రక్తదానం చేసిన కానిస్టేబుల్

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న గోవిందుల జీవన్ అనే కానిస్టేబుల్ 17వ సారి మంగళవారం రక్తదానం చేశారు. ఎంతో మందికి అత్యవసర సమయంలో జీవన్ రక్తదానం చేశారు.

బదిలీపై వెళ్తున్న అధికారులకు సన్మానం

రాయికల్: మండలంలోని ఇటిక్యాలలో పంచాయతీ కార్యదర్శి, బ్యాంక్ మేనేజర్, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బదిలీ కాగా, అంగన్‌వాడీ కార్యకర్త పదవీ విరమణ పొందగా, వీరిని మంగళవారం గ్రామపంచాయతీలో సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ మహిపతిరెడ్డి, వీడీసీ అధ్యక్షుడు విష్ణు, శేఖర్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మేడిపల్లి: మండలంలోని గోవిందారం అటవీశాఖ సెక్షన్ అధికారిగా గత దశాబ్ద కాలంగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న అటవీ శాఖ అధికారి గాండ్ల మధుసూదన్‌కు మండల ఆత్మీయులు సన్మానించారు. అటవీ సంపదను కాపాడడంలో మధుసూదన్ చేసిన కృషిని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సత్తిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు

ఫార్మాసిస్ట్‌కు..

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పనిచేస్తున్న ఫార్మాసిస్ట్ చిలివేరి ఉదయ్ ప్రసాద్ కోరుట్ల ఆస్పత్రికి బదిలీ కాగా, మంగళవారం ఉదయ్ ప్రసాద్‌ను వైద్య సిబ్బంది, లయన్స్ క్లబ్ సభ్యులు, స్నేహితులు, పాత్రికేయులు సన్మానించారు. కార్యక్రమంలో వైద్యాధికారి హరీశ్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శాంతభూషణ్, సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిలిచిపోయిన పనులు పరిశీలన

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ ప్రాథమిక పాఠశాలలో నిలిచిపోయిన మన ఊరి మన బడి పనులను మంగళవారం ఎంపీవో చంద్రశేఖర్ పరిశీలించారు. అసంపూర్తిగా నిర్మించిన టాయిలెట్లు, వాష్ బేషన్ పనులు, ఎలక్ట్రిషన్ పనులను పరిశీలించి, పనులను పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. బిల్లులు ఇస్తేనే పనులు పూర్తి చేస్తానని, కాంట్రాక్టర్ తెలిపినట్లు ఎంపీవో చంద్రశేఖర్ తెలిపారు. అనంతరం కొమటికొండాపూర్, డబ్బా, గ్రామాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సరైన ఆహారం, వ్యాయామంతోనే ఆరోగ్యం

జగిత్యాల: ఆహారం, వ్యాయామంతోనే మనిషి ఆరోగ్యకరంగా ఉంటారని స్త్రీ వైద్య నిపుణులు బాస రత్నశ్రీ అన్నారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీసీవోఎస్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగాఆమె మాట్లాడుతూ నెలసరి సక్రమంగా రాకపోవడానికి ఆహారమే కారణమవుతుందన్నారు. జంక్‌ఫుడ్‌లు మానేసి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని, పీసీవోఎస్ సమస్య యువతుల్లో అధికంగా ఉంటుందన్నారు. అనంతరం హార్మోన్స్ అసమతుల్య నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను స్లైడ్‌షో ద్వారా వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అలియా మక్సూద్, ఎన్‌సీసీ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గోరింటాకు వేడుకలు



రాయికల్: పట్టణంలోని భవాని కిట్టిపార్టీ ఆధ్వర్యంలో ఆషాఢ మాసం సందర్భంగా మంగళవారం గోరింటాకు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఒకరికొకరు గోరింటాకు పెట్టుకుని దాని ప్రాధాన్యతను వివరించారు.